# మరపురాని మరాఠీ థేంక్స్

ఉన్న విషయం చెప్పకపోవడమేం? నాది కాస్త ఎక్సర్‌సైజు చేసిన బాడీ. మా కిరణ్ గాడిది ఓ మోస్తరు ఊబ శరీరం. మేం ఇద్దరం కలిసి వెళుతూ ఉంటే మాకంపెనీలో వాళ్ళందరూ జోక్ చేస్తూంటారు "ఒరేయ్ బాక్సింగ్ ఛాంపియన్స్ ఇద్దరూ బయలుదేరారురా" అని. వాళ్ళెంత నవ్వినా ప్రస్తుతం మేం ఇద్దరం ఒకే పరిస్థితిలో ఉండడం వల్ల, తరచూ ఇద్దరం కలిసే తిరుగుతున్నాం. పెళ్ళికాక నేనూ, పెళ్ళాం పురిటికి వెళ్ళి వాడూ, మొత్తం మీద ఇద్దరం ఒంటికాయ శొంఠికొమ్ముల్లాగే ఉన్నాం. కంపెనీకి వెళ్ళినప్పుడు ఆ ఏడెనిమిది గంటలూ ఏమోకానీ, కేంటీన్‌కి వెళ్ళినా, స్విమ్మింగ్ పూల్‌కి వెళ్ళినా, షాపింగ్‌కి వెళ్ళినా, సినిమాకి వెళ్ళినా విడిగా ఉండలేని ప్రేమికుల జంటలా, వాడూ, నేనూ, కలిసి వెళ్ళవలసిందే. మా విరహం ఎంతదాకా వచ్చిందంటే నా బేచ్‌లర్ క్వార్టర్స్‌కి తాళం వేసి నాలుగు జతలూ, దిండూ దుప్పటీ, టూత్ బ్రష్షూ షేవింగ్ సెట్టూ వంటి నిత్యావసర వస్తువులు తీసుకుని వాడి క్వార్టర్స్‌కి ఏకంగా మకాం మార్చేశాను. కొన్నాళ్ళు కాపురం చేసిన కొంప కదా, కాఫీ పొడుం, పంచదార, మనసువేస్తే కాస్త ఉప్మా కలియబెట్టుకోడానికి ఒక బాణలీ వగైరా సరంజామా అంతా ఉందక్కడ.

ఆ రోజు పొద్దున్నే తేలుకుట్టిన వాడిలా ఉలిక్కిపడి మంచం మీంచి లేచి, "ఇవాళ నా మేరేజ్ డే రోయ్" అంటూ అరిచాడు కిరణ్. "వెధవ కబుర్లు చెప్పకు. ఇవాళ మార్చి పదిహేను. నీ పెళ్ళి అయింది, మార్చి ముప్పయిని. నా పుట్టిన రోజు వెళ్ళిన పదిహేను రోజులకి నీ పెళ్ళి అయింది. నాకు జ్ఞాపకం లేదనుకున్నావా?" అంటూ గుడ్లురిమి చూశాను.

"నిజమేరా నిరుడు అంతే. కాని ఈ మాటు నీ పుట్టిన రోజునాడే నా పెళ్ళిరోజయింది. కావలిస్తే గంటల పంచాంగం తెస్తాను చూడు" అంటూ లేచాడు.

"మరీ రాజకీయ నాయకుడి కబుర్లు చెప్పకురా. నిరుడు పదిహేను రోజుల వెనక

అయింది ఈ ఏడు ముందు అవుతుందా? నా పుట్టిన రోజుకి పోటీ వచ్చి దాని ప్రాముఖ్యం తగ్గించాలనే దోపిడీ మనస్తత్వం కాకపోతే"

నా కళ్ళకి ఆ సమయంలో వాడు బూర్జువాలా కనిపించాడు.

"కావలిస్తే చూడు. ఫాల్గుణ శుద్ధ పంచమి ఇవాళే. నా పెళ్ళి పంచమినాడే అయింది. ఇంకా అనుమానమైతే నా ఫైల్లో ఉన్న శుభలేఖ..." అంటూ మళ్ళీ లేవబోయాడు.

భుజం మీద చెయ్యేసి గట్టిగా నొక్కికూర్చోబెడుతూ "నీ సాక్ష్యాలూ అఫిడవిట్లూ ఎవడడిగాడు? తేదీల ప్రకారం నాదీ, తిథుల ప్రకారం నీదీ అన్న మాట! సరే ఒప్పుకున్నాం. అయితే ఏమంటావు ఇంతకీ?" డబాయించబోయాను.

"ఏమంటాను? ఇవాళ నా పెళ్ళి రోజు కనుక స్టౌ దగ్గరికి, ఆ మాటకొస్తే వంటింటి చాయలకి రాను నేను. కాఫీ టిఫినూ, కంపెనీకి శనివారం సెలవు కనక వంటా,కూడా నువ్వే చెయ్యాలి. నా మేరేజ్ డే స్పెషల్ స్వీట్ కూడా ఏదైనా చెయ్యి" అన్నాడు పరుపుమీద మఠం వేసుకుని కూర్చున్నవాడల్లా, దిండు ఒకటి లాక్కుని ఒళ్ళో వేసుకుని ముందుకీ, వెనక్కీ ఊగుతూ.

"పుట్టినరోజు పండుగనాడు నాచేత వంట చేయిస్తావట్రా? స్వీటు కూడా కావాలేం?" అంటూ లేచి వెళ్ళి అమాంతం కిరణ్ కంఠాన్ని నా రెండు చేతులతోనూ స్వాధీనం చేసుకున్నాను. వాడు వెంటనే చేతులూ, కాళ్ళూ కొట్టుకుంటూ "ఒరేయ్ వదల్రా. ఊపిరి ఆడటం లేదు. నేను చస్తానని కాదు కానీ, పుట్టిన రోజు పూటా నీకు నరహత్యా పాతకం చుట్టుకుంటుందనీ..." అన్నాడు.

సరే. కాసేపు అరుచుకుని, దెబ్బలాడుకుని, వాదించుకొని, చివరకు సిటీలోకి వెళ్ళి టిఫిన్ తీసుకుని, మార్నింగ్ షో మంచిదేమైనా ఉంటే చూసి ఏ నక్షత్రం మార్కు హెటల్లోనో హాయిగా భోంచేసి రావాలని నిర్ణయించుకొన్నాం. టేక్సీ ఖర్చూ సినిమా ఖర్చూ ఒకళ్ళూ; టిఫిన్ ఖర్చూ డిన్నర్ ఖర్చూ ఒకళ్ళూ భరించాలని ఖరారు కూడా చేసుకున్నాం.

పంతాలకి పోకుండా కాఫీ ఒక్కటే పెట్టుకుని స్నానాలు చేసి నీట్‌గా డ్రెస్ అయి, కేంపస్ గేటు దాటి, గేటు దగ్గరున్న గూర్ఖా పెట్టిన శాల్యూట్‌ని రోజూకంటే మరి కాస్త ఠీవితో స్వీకరించి,మెయిన్ రోడ్డుమీదకి వచ్చిపడ్డాం. ఒక్క క్షణంకూడా ఎడతెరిపి లేకుండా కార్లూ, టేక్సీలూ, ఆటోలూ, లారీలూ, సిటీ బస్‌లూ ఏకతోరణంలా పోయే రోడ్డు,ఎందుకంత నిర్మానుష్యంగా ఉందో అర్థంకాలేదు. మాగేటుకి ఎదురుగుండా,

రోడ్డుకి అవతలిపక్క ఫ్లాట్స్‌కి సంబంధించిన పైజామా లాల్చీ ఆసామీ ఒకాయన, నిలబడి ఉన్నాడు. మేం కేంపస్ గేట్‌లోంచి వెళ్ళేటప్పుడో, వచ్చేటప్పుడో నెలకి పాతిక ముప్ఫైసార్లయినా కనిపిస్తూ ఉంటాడు ఆయన. ఒక్క మాటు కూడా మాతోటి మాట్లాడలేదు. మేం చిరునవ్వుతో విష్ చేసినా మాకేసి ఎప్పుడూ చూడలేదు. "గీరగాడులే" అని మాలో మేం కసితీరా అతని గురించి కథలు కూడా చెప్పుకుని నవ్వుకున్నాం చాలామాట్లు.

అలాంటి పైజామా లాల్చీ, ఇవాళ తనంతట తాను విష్ చేసి, నవ్వుతూ మా దగ్గరికి రావడం చూస్తే, మాకు మతిపోయింది. బహుశా నా పుట్టిన రోజని తెలిసి ఉంటుందని నేనూ, నా మేరేజ్ డే అని వీడికి ఎలా తెలిసి ఉంటుందబ్బా' అని కిరణ్, మనస్సులో ఏక పల్టీలు కొట్టేసుకుంటున్నాం.

"ఎక్కడికో బయలు దేరినట్లున్నారు?" అచ్చమైన మరాఠీలో అడిగాడు.

"అవునండీ! అలా దాదర్ వరకూ వెళ్ళి వద్దామనీ" అని సమాధానం చెప్పాడు కిరణ్, విభక్తులూ ప్రత్యయాలూ లేని టెలిగ్రాఫ్ హిందీలో.

"మీకు తెలియదా? నిన్న రాత్రి ఘట్‌కోపర్‌లో టేక్సీల వాళ్ళకీ, సిటీ బస్‌ల వాళ్ళకీ గలభా అయింది. అయిదారుగురిని ఆసుపత్రిలో చేర్చారు. ఇవాళ టేక్సీలూ, సిటి బస్‌లూ అన్నీ బంద్" మరాఠీ మానేసి హిందీలో చెప్పాడు.

రోడ్డు మీద వాహనాల తోరణాలు ఎందుకు లేవో మా కప్పుడు అర్థమైంది.

"సరే నడవరా వెనక్కి పోదాం. నీకు వంటా తప్పదు, నాకు వడ్డనా తప్పదు" అన్నాను, మాతృభాష మీద మమకారంతో తెలుగులో.

"అబ్బాయ్! సుఖపడదామన్నా అదృష్టం ఉండొద్దురా? సరే నడు" అన్నాడు కిరణ్ ముఖం వేలాడేసి.

నీరసంగా కాళ్ళీడ్చుకుంటూ బయలుదేరాం వెనక్కి.

"అదేమిటి వెళ్ళిపోతారు వెనక్కి? రండి నా కారులో తీసుకెళ్తాను. నేనెలాగా దాదర్ స్టేషన్‌కి వెళుతున్నాను" అన్నాడు మరాఠీ హిందీలు కలిపేసి, కంగారుగా ఆ ఆసామీ.

అతని మాటలు పన్నీటి జల్లుల్లా ఉన్నాయేమో, కిరణ్ కళ్ళుమెరిశాయి. నా కయితే వెళ్ళి అతన్ని అమాంతం కౌగలించుకుని గట్టిగా ముద్దెట్టుకోవాలి అనిపించింది.

"థేంక్సండీ! మమ్మల్ని దాదర్ స్టేషన్‌కి ఇవతల, ఫిలిప్స్ టవర్ దగ్గర డ్రాప్ చేస్తే చాలు" అన్నాడు కిరణ్.

"ఒరేయ్ .. ఆగు ఆగు. వెళ్ళేటప్పుడు ఈయన కార్లో తీసికెళ్తారు. బాగానే ఉంది. మరి వచ్చేటప్పుడు? అనే సందేహాన్ని వెలిబుచ్చాను. కిరణ్ సంతోషం ఇప్పుడు, సందేహాలు వినే స్థితిలో లేదు. "మనం తిరిగి పన్నెండింటికో ఒంటి గంటకో కాని రాము. అప్పటిదాకా ఈ బంద్ ఉంటుందంటావా? సిటీస్‌లో గంటకంటే బంద్ ఉంటే అంతా గందరగోళం అయిపోతుంది. అనుమానాలు కట్టిపెట్టి బయలుదేరు" అని నన్ను చివాట్లు పెట్టి ఆయనకేసి "నడవండి సార్!" అన్నాడు కిరణ్.

మాకంటే ఎక్కువ సంతోషంతో ఆయన కారు దగ్గరికి బయలుదేరాడు. "దారిన పోయే వాళ్ళకి కారులో లిఫ్ట్ ఇవ్వడం కొందరికి సరదా. ఇలాంటి సరదా పురుషులున్నారు కనుకే వానలింకా కురుస్తున్నాయి" అని కిరణ్, "లోకంలో పరోపకార పరాయణులింకా ఉన్నారు సుమీ!" అని నేనూ, ఇద్దరం ఆయన వెనకాలే బయల్దేరాం.

కారు డోరు తీసి స్టీరింగ్ దగ్గర కూర్చున్నాడు ఆయన. మే మిద్దరం కూడా కారు యజమానుల్లాగ దర్జాగా వెళ్ళి వెనక సీట్లలో కూర్చున్నాం.

డుర్...ర్...ర్... డుర్ర్రుర్..రుర్...

"ఏమిసార్! సెల్ఫ్ అవడం లేదా?" కిరణ్ హిందీలో అడిగాడు.

"రాత్రి అంతా తియ్యలేదు కదండీ! బేట్రీ డౌన్ అయి ఉంటుంది."

"ఉండండి... మేం ఇద్దరం కిందకి దిగి తోస్తాం." అని ఆయనతో మర్యాదగా అని, "దిగవేంరా!" అని నన్ను అమర్యాదగా గద్దించాడు కిరణ్.

ఇంకొంచెం ఉంటే కొడతాడేమోనని భయపడి కిందికి ఉరికాను. ఇద్దరం ఊతమైన వాళ్ళమే కనక, పట్టుబట్టి తోసేసరికి కారు గబగబా దొర్లసాగింది. మాంచి ఉషారుగా తోస్తున్నాము. సడన్‌గా గేరు వేశాడు ఆయన. దొర్లే దొర్లే కారు కాస్తా ఆగిపోయింది.

"అప్పుడే వెయ్యకండి సార్ గేర్! కాస్త దొర్లనివ్వండి" విసుక్కున్నాడు కిరణ్. నా కయితే అసహ్యమే వేసింది. మేం, మా శక్తి అంతా ఉపయోగించి కారుని గబగబా దొర్లేలా తొయ్యడం, ఆయన గేర్ మార్చడం, కారు ఆగిపోవడం, మాకు ఒళ్ళు మండిపోవడం, ఇలా దాదాపు అయిదారుసార్లు అయాక ఇంజన్ స్టార్టయింది.

"గబగబా ఎక్కండి. మళ్ళీ ఇంజను ఆగిపోతుంది" చంటి కుర్రాళ్ళని కోప్పడినట్లు కోప్పడ్డా డాయన మమ్మల్ని.

కారు హాయిగా మెత్తగా పోతోంది. చెమట పట్టిన ఒంటికి విండోలోంచి వస్తూన్న గాలి తగులుతూంటే సుఖంగా ఉండి, పడిన శ్రమ అంతా మరిచిపోతున్నాం. ఓ పావు గంట శ్రమపడితే ఏంగాక? ఎంత బాగుంది. వాచీ చూసుకున్నాను. మార్నింగ్ షోకి

ఇంకా నలభై నిమిషాలే టైముంది. కిరణ్‌కి వాచీలో టైమ్ చూపించి, "ఇంకో ఇరవై నిముషాలు లోపుగా మనం దాదర్ చేరుకోగలమా?" అన్నాను.

"పోన్లెద్దూ! టైమ్ లేకపోతే టిఫిన్ మానేద్దాం" అన్నాడు. నాకు వాడిని చంపేద్దాం అన్నంత కోపం వచ్చింది. అవునుమరి! వాడికేం? నాకు ఆకలి దహించుకుపోతోంది. సినీమాయేనా మానేస్తాను కాని, టిఫిన్ మానేది లేదు అని నిర్ణయించుకున్నాను.

సాఫీగా పోతున్న కారల్లా సడన్‌గా ఆగిపోయింది.

ఏమైంది అన్నట్లు ఇద్దరం కంగారుగా చూశాం.

చౌరస్తా ఎదురుగుండా ఎర్రలైటు వెలుగుతోంది.

"మీరు మాత్రం ఇంజను ఆపకండి" వెనుకనుంచి అరిచాం.

'నేను ఆపేది ఏమిటి? అదే ఆగిపోయింది.' చిరునవ్వుతో సమాధానం చెప్పాడు కారు యజమాని.

'నవ్వుతావేమిటిరా నాయనా! మళ్ళీ దిగి తొయ్యాలేమిటి కర్మ' అనుకున్నా. అనుకున్నంతా అయింది. సిగ్నల్ ఎరుపులోంచి ఆకుపచ్చలోకి మారింది. కాని కారు కదలదే!

మళ్ళీ మామూలే! డుర్...ర్...ర్...ర్... వెనకనుంచి హారన్లు. కేకలు, అరుపులు. విండోలోంచి తలదూర్చి వెనక్కి చూశాను. వెనకాల ఓహ్! పాతిక ముప్పై కార్లు, ట్రక్కులూ, లారీలూ - ట్రాఫిక్ అంతా ఆగిపోయింది ముందున్న మా కారు ఆగిపోవడంతో. పాతిక ముప్పై మంది అయితే వచ్చి మాకారు చుట్టేశారు. అరిచి, ఆ తర్వాత అర్థం చేసుకుని, అందరూ కలిసి కారుని తోశారు. అలా పదిహేను గజాలు తొయ్యగా తొయ్యగా స్టార్ట్ అయింది. హమ్మయ్య! వెనక కార్ల వాళ్ళ ధర్మమా అని మాకు శ్రమ తప్పింది... లేకపోతే నాకూ, కిరణ్‌కి మళ్ళీ పని తగిలి ఉండేది.

"మహాప్రభో! మధ్యలో ఇంక ఆపకు. తిన్నగా పోనియ్యి" అన్నా.

"క్యా..? క్యా...?" అన్నాడు ఆయన, తెలుగులో నేను ఏం అన్నానో అర్థంకాక నాకేసి తల తిప్పి చూస్తూ.

"వెనక్కి చూడకురా నాయనా! ముందుకి చూడు. కొంప మునుగుతుంది లేకపోతే" నాలో నేను గొణుక్కున్నాను.

"వెనక టైర్లో గాలి తగ్గినట్లుంది. గాలి కొట్టించాలి" అంటూ హిందీలో ఒక ప్రకటన జారీ చేశాడు.

"ఒరేయ్! ఈ యములాడు మళ్ళీ కారు ఆపేలా ఉన్నాడురోయ్!" అన్నా భయంతో వణికిపోతూ.

"ఏం చేస్తాం? ఇద్దరం భారీ మనుషులమే కనుక టైరు, రిమ్ముకి తగులుతున్నట్లుంది. సరే దిగు" అన్నాడు కిరణ్

గాలి కొట్టించి తిరిగి బయలుదేరబోయేసరికి మళ్ళీ మామూలే! ఆయన దర్జాగా స్టీరింగ్ తిప్పుతూ కూర్చోవడం, మేం చెమటలు కారుస్తూ రొప్పుతూ వగరుస్తూ, వెనకనుంచి కారు తొయ్యడం. బాగా సేవ చేయించుకోవడం మరిగినట్లుంది. ఈ మారు పూర్తిగా అరగంట అయితేనే గాని స్టార్ట్ కాలేదు. దాదాపు కిలోమీటర్ దూరందాకా అలా తోస్తూనే ఉన్నాం.

స్టార్ట్ అయిందిరా. భగవంతుడా అని ఎక్కి కూర్చుని టైము చూసుకుంటే ఏముందీ? మార్నింగ్ షో కొండ ఎక్కింది. ఇక మాకు మిగిలిందల్లా దాదర్‌లో దిగి, మంచి టిఫిన్ దొరికే హోటల్ ఏదైనా ఉంటే చూసుకోవడం.

"ఫిలిప్స్ టవర్ దగ్గర ఆపితే మళ్లీ స్టార్ట్ కాదేమో" అంటూ ఏకంగా స్టేషన్ దగ్గరకే తీసికెళ్ళి ఆపాడు. ఏదో మర్యాద కోసం "థాంక్సండీ" అంటూ దిగాం కాని, లేకపోతే వాణ్ణి మధ్యలో నుంచో పెట్టి, ఫుట్ బాల్ ఆడెయ్యాలని ఉంది మా ఇద్దరికీ.

అతను "ట్రైన్ రావడానికి ఇంకో అరగంట టైముంది. అందాకా నేను ఇక్కడే ఉంటాను. మీకు పనులు అయిపోతే రండి. నేను మళ్ళీ మిమ్మల్ని మీ క్వార్టర్స్ దగ్గర డ్రాప్ చేస్తాను" అన్నాడు చిరునవ్వు నవ్వుతూ.

"ఎందుకూ? వెళ్ళేటప్పుడు కూడా నీ కారు తొయ్యడానికా? మా నాయనే!" మనస్సులో పళ్ళు పటపటా కొరికాను.

"మీ కా శ్రమ వద్దుసార్! అయినా ట్రైన్‌లో మీ ఆడవాళ్ళూ పిల్లలూ వస్తారు కదా! కార్లో ఇంక మాకు చోటేం ఉంటుంది?" మర్యాదగా అతని మాటని త్రోసిపుచ్చాడు కిరణ్.

"ఆ ఇబ్బంది ఏం ఉండదు. వాళ్ళు వెనక కూర్చుంటారు. మీరు ఫ్రంట్‌లో నా పక్కని కూచోవచ్చు" అన్నాడు.

చివరికి అతనన్నదే అయింది. ఆ చుట్టుపట్ల ఉన్న ఒకటి రెండు సౌత్ ఇండియన్ హోటల్స్‌లోనూ టిఫిన్ అయిపోయింది. వాళ్ళకి మీల్స్ సెక్షన్ లేదు. సినీమా ఎలాగూ సున్న చుట్టింది. సినీమా టిఫినూ రెండూ పోయాయి. పోనీ భోజనం అయినా చేద్దాం అంటే, అక్కడికి మూడు మైళ్ళుంది సౌత్ ఇండియన్ మీల్స్ హూటల్. సిటీ బస్ టాక్సీల బంద్ ఇంకా కొనసాగుతున్నట్లుంది.

అన్నం కోసం అంత దూరం ఎవడు నడవగలడు ఈ ఎండలో! అప్పుడే పదకొండు దాటుతోంది. పోనీ అని అన్నం కోసం ఆశపడి వెళితే, మళ్ళీ తిరిగి

రావడమో! ఆ హూటల్ నుంచి ఇక్కడికి మూడు మైళ్ళూ, ఇక్కడనుంచి క్వార్టర్స్‌కి పన్నెండు మైళ్ళూ.

ఓరి నాయనోయ్! ఒక్కమాటు గుండె ఆగిపోయింది. మీల్స్ హొటల్‌కి మానేసినా ఇప్పుడు తిరిగి క్వార్టర్స్‌కి వెళ్ళాలి కదా! అదెలాగ? మాకు ఇందాకటి మరాఠీ హిందీ ఆసామీ తప్ప, మరో మార్గంతరం తోచలేదు. ఈపాటికి ట్రైన్ వచ్చేసి పెళ్లాం పిల్లలతో అతను వెళ్ళిపోయాడేమో!' పరుగులాంటి నడకతో, దాదర్ స్టేషన్‌చేరుకున్నాం.

హమ్మయ్య! అతను వంగుని డిక్కీలో పెట్టెలూ బుట్టలూ సర్దుకుంటున్నాడు. కార్లో అతని భార్యా పిల్లలూ కాబోలు కబుర్లూ, కేరింతాలతో ఉన్నారు. మమ్మల్ని చూసి అతను చిరునవ్వుతో ఆహ్వానించాడు. మేంకూడా మా పెదిమలమీద నిస్సహాయంతో కూడిన నీరసపు చిరునవ్వు అరువు తెచ్చుకున్నాం.

స్టీరింగ్ దగ్గరికి వెళ్ళి అతను కూర్చోగానే, చెప్పక్కర్లేకుండా మాకర్థమైంది. వెంటనే డ్యూటీలో చేరాం. పైన నెత్తి మాడ్చేస్తూన్న ఎండ. ఇందాకటి కంటే బరువు పెరిగిన కారు.

'ఎంత అవస్థతెచ్చి పెట్టావురా దేవుడా' అనుకుంటూ కళ్ళనీళ్ళు తరువాయిగా కార్యక్రమం ప్రారంభించాం. మా మీద దయుంచి ఒక అరకిలోమీటరు బతిమాలించుకొని, తరవాత స్టార్టు అయింది. ముందు, కారు యజమాని, నేనూ కిరణ్. వెనక సీట్లో పిల్లలు కోడిలాగా అతని భార్య. ట్రంక్ కాల్స్‌లోలాగ ముందునుంచి అతనూ, వెనక సీట్లోంచి వాళ్ళూ, మరాఠీలో ఏదో మాట్లాడుకుంటున్నారు. వీళ్ళెవరని ఆమె అడిగిందేమో! కార్లు ఆగిపోతే తోసేవాళ్ళని వీడు అన్నాడేమో కర్మ. మాకు మరాఠీ రాదు.

మధ్యలో మా దురదృష్టంకొద్దీ, ఆమెకి మిల్క్ పాకెట్లు జ్ఞాపకం వచ్చాయి. అంతే! కారు ఆగిపోయింది. ఆయన షాపులోకి వెళ్ళి పాకెట్ పట్టుకొచ్చాడు. మాకేసి చూశాడు. అంతకంటే ఏం చెప్తాడు? సరే దేవుడా అంటూ కారు దిగాం. ఈమాటు అది మా మీద పూర్తిగా కక్ష కట్టింది.మేంకూడా నీరసంతో తోటకూర కాడల్లా వేళ్ళాడిపోతున్నాం. ఓపిక అంతాకూడదీసుకుని బతిమాలగా బతిమాలగా, చివరికి మా మీద దయతలచి, స్టార్ట్ అయింది. పాపం ఇంక మధ్యలో పేచీ పెట్టలేదు

మేం, కారు దిగి, వెర్రిమొహా లేసుకుని మా కేంపస్‌గేటు వేపు బయలుదేరబోతూంటే, "థాంక్స్" అన్నాడు ఆయన.

నిజమే మరి! థాంక్స్ కాదూ? సెల్ఫ్ స్టార్ట్ కావడం లేదని తెలిసే, మమ్మల్ని దాదర్ స్టేషన్‌కి తీసుకెళ్ళి తీసుకొచ్చాడు. పుట్టిన రోజు పూటా నేనూ, మేరేజ్‌డేపూటా కిరణ్,

చేసిందేవిటి? వెళ్ళేటప్పుడు ఆ మరాఠీగాడినీ, వచ్చేటప్పుడు వాడి మొత్తం కుటుంబాన్నీ కార్లో కూచోబెట్టి ఊరేగించాం. బుద్ధిలేక బయలుదేరాం. దాదర్‌కి నడిచి వెళ్ళి నడిచి వచ్చినా బాగుణ్ణు. వాడి కారు తోసుకుంటూ వెళ్ళి తోసుకుంటూ వచ్చాం. కనీసం చేసిన చాకిరీకి కాఫీ అయినా ఇప్పించాడు కాదు. దుర్మార్గుడు! అయినా మాకు బుద్ధి ఉండొద్దూ? ఎప్పుడూ లేంది వాడు ఎందుకు లిఫ్ట్ ఇస్తానన్నాడో తెలుసుకోలేకపోతే ఎలా? మా బాగా అయింది! ఇవాళ ఎంతో హుషారుగా దర్జాగా ఉండాలనుకున్నది మొత్తానికి ఆ మరాఠీ వాడికీ, వాడి పెళ్ళానికీ పల్లకీ బోయీలుగా పనికి వచ్చాం.

మమ్మల్ని వెర్రి వెధవల్ని చేసి మహ బాగా ఉపయోగించుకున్నాడు. ఇద్దరం ఊతమైన వాళ్ళమేమో, మా ఊతం కరెక్ట్‌గా ఉపయోగపడింది. నేను కిరణ్‌కేసీ వాడు నాకేసీ ఒకళ్ళ నొకళ్ళు నమిలేసి తినేసేటంత కోపంగా చూసుకున్నాం.

"ఊఁ అఘోరించాం కానీ, నడు, ఇంత ఉడకేసుకుని తిందాం" అన్నా.

"మనం దొరక్కపోతే ఇవాళ వాడు"

"చచ్చి ఉండును" అన్నాను కసిగా.

"ఆ చావు మన కొచ్చింది."

"ఇలా మన చేత చాకిరీ చేయించుకుందాం అని మొత్తంఅంతా ముందు ప్లానేసే చిరునవ్వు నవ్వాడేమోరా దొంగ రాస్కెల్!"

"కాక? వాడి పనైపోయింది. అందుకే థాంక్స్ చెప్పి పంపించాడు. మన లావూ, ఒడ్డూ, పొడుగూ, హాయిగా బయటికి వెళ్ళి స్పెండ్ చెయ్యాలనే మన దురాలోచనా, అన్నీ వాడికి లాభించాయి. అబ్బాయ్! పుట్టిన రోజు పూటా నాకూ, మేరేజ్‌డే పూటా నీకూ దర్జాగా వాడి కారు మీద జల్సా చేద్దాం అనే సరదా పుట్టింది. వాడినీ, వాడి కారునీ వాడుకుని ఓ థాంక్స్ పడేద్దాం అనుకున్నాం? ఆ పనివాడే చేసి, వాడే పడేశాడు మనకి థాంక్స్"

"మన సరదాని వాడు ఎక్స్‌ప్లాయిట్ చేశాడంటావా?"

"ఇంకా అనుమానమా? నోరు మూసుకుని నడు. నాకు నీరసంతో శోష వస్తోంది. ఇంత ఉడకేసుకుని తినాలి."

"చివర థాంక్స్ అన్నాడంటే, మొదటే ప్లాన్ వేశాడన్న మాట!"

"ఒరేయ్! ఇంకేం చెప్పకురా. నాకు ఏడుపు వస్తూంది" అన్నా.

ఇవాల్టికికూడా మరాఠీవాడి థాంక్స్ నేను మరిచిపోలేను. దొంగ రాస్కెల్ ... నవ్వుతూ ఎంత నైస్‌గా చెప్పాడు థాంక్స్!

*(1986 ఆంధ్ర ప్రభ)*